


భయపడినంతా జరిగింది. డాక్టర్ రంగరాజుగారు పరీక్షలన్నీ పూర్తి చేసి చెప్పారు. "గతంలో కన్నా మెరుగ్గా ఏమీ ఉన్నట్లు లేదు! ఇంకో వారం రోజులపాటు మీరు మాట్లాడకుండా ఉంటేనేమంచిది. ఆ తర్వాత.... అవసరాన్ని బట్టి ఆలోచిద్దాం!"

– నా గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. మళ్ళీ వారం రోజులు... ఇప్పటికిది అప్పుడే నాలుగోరోజు పెదవి విప్పి మాట్లాడి! ఇంకా.. ఇంకో వారం రోజులు... మాట్లాడకుండా ఉండగలనా??

ఇప్పటికే నాకు ఇంట్లో అందరికీ దూరమైన భావన ఉంది.

– అయిదు రోజులకిందట... రంగరాజుగారు పరీక్షలన్నీ చేశారు. "మీ గొంతులో నాడ్యుల్స్ పెరుగుతున్నాయి. మీరు వారం, పదిరోజులపాటు ఏమీ మాట్లాడకుండా ఉండటం అవసరం. అప్పటికి, ఆ విశ్రాంతితోబాటు నేనిచ్చిన మందులవల్లా గుణం కనిపించే అవకాశం ఉంది. అప్పటికి తగ్గకపోతే, ఆపరేషన్ సంగతి అలోచిద్దాం!"

– నివ్వెరపోయాను నేను. మాట్లాడకుండా వారం, పదిరోజులా? జరిగే పనేనా అది??

ఆ మాటే పైకి అన్నాను. "డాక్టర్‌గారూ, ఇంట్లో పరిస్థితి మీకు తెలీందిగాదు. పిల్లలిద్దరూ చిన్నవాళ్ళు. వాళ్ళను క్షణక్షణమూ ముందుకు తోస్తే తప్ప ఏ పనీ చేసుకోలేరు. అనుక్షణమూ

అరిస్తే తప్ప వాళ్ళు ఆఖరికి స్కూలుకు కూడా తయారు కాలేరు. అలాటిది... వారం పదిరోజులు..” ఆగాను.

“మీ ఇష్టంమరి! డాక్టర్‌గా చెప్పాల్సింది చెప్పాను! నేను చెప్పినట్లు వారం పదిరోజులు మాట్లాడకుండా ఉండి, ఆ తర్వాత మళ్ళీ మాట్లాడతారో... లేకపోతే ఈ వారం రోజులూ మాట్లాడి, ఆ తర్వాత జీవితాంతం ఏమీ మాట్లాడరో... మీరే నిర్ణయించుకోండి! మీరేం చెప్తే అలాగే చేద్దాం!” డాక్టరుగారు స్పష్టం చేశారు. నామీద సూటిగా వదిలిన బ్రహ్మాస్త్రం అది. సంధించేటపుడు ఆయన ఆశించిన ఫలితం లభించింది ఆయనకు!!

“సర్లెండి.. ఈ వారంరోజులే మాట్లాడకుండా ఎలాగోలా కాలక్షేపం చేస్తాను. కానీ... తప్పనిసరైతే, అపుడపుడైనా...” ఆగాను.

“కుదరదు! ఏమీ మాట్లాడకూడదంటే ఏమీ మాట్లాడకూడదు అంతే! ఈ క్షణంనుంచే మీరేమీ మాట్లాడకూడదు అంతే!” ఖచ్చితంగా చెప్పారాయన.

“.. డాక్టర్..” అంటూ ఆగాను. ఇంకేమీ మాట్లాడవద్దంటూ ఆయన నాముందుకు ఒక కాగితాన్ని తోసి ఒక కలాన్ని అందించారు. “మాట్లాడాల్సింది ఏదైనా ఉంటే ఈ కాగితం మీద రాయండి. మీరిది అలవాటు చేసుకోండి. పదిరోజులపాటు... చాలు... ఆ తర్వాత అంతా సరిపోతుంది. బెస్టాఫ్‌లక్!!”

కాగితం, కలం అందుకున్నాను. ‘మాట్లాడదల్చింది అంతా రాయాలిట! ఏం రాయాలి? ఏం రాస్తే నా ఆలోచనలకు, భయాలకు, ఆందోళనలకు అక్షరాకృతి కల్పించినట్లవుతుంది? ఎన్ని అక్షరాలు రాస్తే నా ఆలోచనలకు సరైన ప్రతిబింబం ఎదురవుతుంది? అనూహ్యమైన వేగంతో తలెత్తే నా ఆలోచనలను ఈ అక్షరాలు అందుకోగలవా? కష్టపడి రాసినా, ఆ అక్షరాలు నా ఆలోచనల లోతుల్ని స్పృశించగలవా? ఇంట్లో వాళ్ళు వాటికి సరిగ్గా ప్రతిస్పందించగలరా?’

అన్నీ ప్రశ్నలే!!

జీవితంలో ఇంత పెద్ద ప్రశ్నను ఎదుర్కోవాల్సి వస్తుందని నేనెప్పుడూ ఊహించుకోలేదు. కనీసం సమాధానం చెప్పుకోలేని, సమాధానపడలేని పరిస్థితి ఇది!!

– చేతిలో కాగితం వణుకుతోంది. కలం మూగపోతోంది. ఆలోచనలు అల్లిబిల్లి రూపాన్ని వదిలి, నిశ్శబ్దాన్ని నిస్తబ్దతను వరిస్తున్నట్లుగా ఉంది.

– మాటతోబాటు నా మనసు కూడా మూగపోతోందా?? వారం, పదిరోజులు గడిచేసరికి నేను మాటనే మర్చిపోతానా??

భయమేస్తోంది. బాధగా ఉంది. భరించలేనిదిగా ఉంది. కానీ, తప్పదు!

నా స్వరపేటికకు ఎవరో తాళం వేస్తున్నారు. గళమెత్తి మాట్లాడనీయకుండా నొక్కుతున్నారు. ఎలా ఎదుర్కోగలనీ పరిస్థితి!!

మౌనంగా ఇంటికొచ్చాను.

ఇల్లంతా మౌనంగా ఉంది. నిశ్శబ్దంగా ఉంది. చీమ చిటుక్కుమన్నా వినిపించేంత ప్రశాంతంగా ఉంది.

మా ఇల్లు.. ఇలా ఎప్పుడైనా ఉండేదా? ఎంత సందడిగా ఉండేది, పిల్లలిద్దరూ కథలు చెప్పుకోవటం, కబుర్లు కలబోసుకోవటం, కొట్లాడుకోవటం.. నేను గొంతెత్తి ఒక్కసారి అదిలించటం, ఇంకోసారి మాట్లాడకండి అని కసురుకోవటం..

కానీ, ఇపుడేదీ అదంతా?

పిల్లలు స్కూలుకెళ్ళారు. ఆయన కాంపుకెళ్ళి ఈవేళ్టికి ఇరవైయో రోజు. రేపోమాపో ఆయన రానేవస్తారు. వచ్చి.... ఏవేవో చెప్తారు.

కానీ, తాను ఏం మాట్లాడగలదు తను? నోరెత్తి ఊ అనగలదా? ఏం జరిగిందీ వివరించి చెప్తే... ఇంకా చెప్పటం ఏమిటి! వివరించి రాసి చూపిస్తే... ఆయన ఎలా రిసీవ్ చేసుకొంటారు?

పరిస్థితి ఏమీ పాలుపోకుండా ఉంది.

ఇంట్లో ఏదో ఓ మూలనుంచి కీచురాయి అరుస్తుంది. అవును. అదేమిటి... ఆ మూలనున్న ఫ్రిజ్ సన్నగా చప్పుడు చేస్తోంది. వినీవినిపించనంత నెమ్మదిగా... దూరంగా ఎక్కడో ఏదో పక్షి అరుస్తోంది. చిత్రంగా ఉంది. ఇలాంటివి నేనెప్పుడూ విని ఎరగను! ఈ వేళే తొలిసారిగా ఇవన్నీ వింటున్నాను".

గతంలో ఇవన్నీ లేవా! మా ఇంట్లో కీచురాళ్ళు వీధిలో ఆ చెట్టుమీద పక్షి... ఇవేవీ కొత్తగా వచ్చినవి కావు. మరి వీటిని ఈ రోజే మొదటిసారి వినటం ఏమిటి.

బహుశా ఇంత క్రితం వీటిగురించి నేనెపుడూ ఇలా ఆలోచించికూడా ఎరుగను. ఎంత సేపూ నా ఇల్లూ, నా పిల్లలూ, నా సంసారం... ఈ 'నా' గొడవలో తలారా మునిగిపోయిన నాకు మిగిలినవాటి గురించి పట్టించుకునేంత ఓపిక, ఆలోచించేంత సమయమూ ఉండేవి కావేమో!

మొదటిసారి చెవులు రెండూ పెట్టుకొని సరిగా వినే ప్రయత్నం చేశాను. నిశ్శబ్దంగా ఉన్నట్లనిపించే ఈ నిశ్శబ్దంలో ఎన్ని శబ్దాలో!!

గేటు తీసిన చప్పుడయింది. పిల్లలు వస్తున్నారు. ఆ గోలే చెప్తోంది ఆ సంగతి. ఎంత గోల చేయగలరో వీళ్ళు అని విసుక్కొంటూ ఉండే పిచ్చిదాన్ని, ఈ రోజు ఆ గోలేమిటో, ఎందుకు చేస్తున్నారో అని ఆలోచించటమారంభించాను.

ఇద్దరికిద్దరూ తోడుదొంగలు. వాళ్ళల్లో వాళ్ళు ఎన్ని కబుర్లు చెప్పుకొంటున్నా, దూరంగా ఉన్న నాకు వినిపిస్తోంది.

లాన్‌లో నిశ్శబ్దంగా తలెత్తుతున్న ఆ పసి మొలకల గురించి, ఆ లాన్ పక్కనే పెరుగుతున్న క్రోటన్స్ గురించి, అమాయకంగా ఉన్నట్లు కనిపించినా అందర్నీ ఆకట్టుకొనే ఆ పూలగురించి... వాళ్లిద్దరూ వీటన్నింటిగురించీ మాట్లాడుకొంటున్నారు!

వీళ్ళలో ఇంత పరిశీలనాశక్తి దాగి ఉందా? నాకీ సంగతి ఇంతకుముందు తెలీదే??

ఇంట్లోకి రాగానే నా ముఖం కేసి చూశారు. అప్పటికే వాళ్ళ ముఖంలో ఏదో తెలియని సీరియస్‌నెస్ వచ్చేసింది.

పెద్దాడు విజయ్ నెమ్మదిగా దగ్గరకొచ్చాడు... "డాక్టరుగారు ఏమన్నారమ్మా" అని అడిగాడు.

కాగితం మీద రాసి చూపించాను. ఏమీ మాట్లాడవద్దన్నారు!

అది చదివి వాడు ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. చిన్నవాడికి ఏం చెప్పాడో తెలీదుగానీ, వాడేమీ మాట్లాడలేదు.

ఇప్పుడు ఇంట్లో ముగ్గురం. అయినా ఉలుకూ పలుకూ లేదు. నిశ్శబ్దం ఇంత భయంకరంగా ఉంటుందా!

ఇంకా ఒకటి రెండు రోజులకుకానీ రారనుకొన్న ఆయన ఆ రోజే వచ్చేశారు. డాక్టర్‌గారు చెప్పింది కాగితం మీద రాసి చూపించాను. అదాయన చదివారు. ఒకసారి నాకేసి చూశారు. తర్వాత నెమ్మదిగా నా చెయ్యి పట్టుకొన్నారు. ఆ స్పర్శలో ఎన్ని భావాలున్నాయని! ఆయన నన్ను స్పృశించటం ఇది తొలిసారికాదు. పెళ్ళయిన రోజున, మొదటిరోజున ఆయన ముట్టుకొన్నారు. ఆ స్పర్శ భాషవేరు. ఆ తృష్ణ వేరు! ఇప్పటి స్పర్శలో నాకు వినిపిస్తున్న బాధ వేరు. ఆవేదన వేరు! ఆయన కళ్ళల్లోంచి నీరు కారటంలేదు గానీ... ఆ స్పర్శ కారుస్తున్న కన్నీరు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

ఇంట్లో నలుగురం ఉన్నా ఇల్లంతా నిశ్శబ్దం.

"మీరంతా మాట్లాడుకోవటం లేదేం?" అని రాశాను ఒక కాగితంమీద. ఆయనకు, విజయ్‌కు, వినోద్‌కు చూపించాను. ఆ కాగితంలోని అక్షరాలను వాళ్ళు చదివారేగానీ నాకే సమాధానమూ ఇవ్వలేదు.

'ఓరి భగవంతుడా! ఇంత శిక్ష వేశావెందుకు నాకు! అనుకొన్నాను.

పగటిపూట ఎవరి భోజనం వేళలు వారివే. అయినా రాత్రిపూట, మా అందరికీ ఒకేసారి కలిసి తినటం అలవాటు. దాదాపు అది రోజూ ఉండే ఫామిలీ గెట్ టుగెదర్. ఆయన ఆఫీసు విశేషాలు, విజయ్, వినోద్‌ల స్కూలు కబుర్లు, నా వంటింటిసంగతులు అన్నీ అక్కడ మా అందరిముందూ పర్చుకొంటాయి. అన్నిటినీ నంచుకొంటూ అదో పండగలా చేసుకొంటూ ఉంటాం. రోజూ తినే భోజనమే అయినా, రోజూ ఉండే నలుగురమే అయినా... కానీ, ఈ రోజు...

అందరూ కలిసే భోజనం చేస్తున్నాం. కానీ మా మధ్య ఒక్కమాటకూడా చోటు చేసుకోవటం లేదు. ఏదో తెలీని ఉక్కిరిబిక్కిరి...

అందరి భోజనాలూ అయిపోయాక పిల్లల్ని పడుకోబెట్టి, ఆయన దగ్గర చేరాను.

'కాగితం, కలం అందుకొని ఏమిటిలా ఉన్నారు? ఏం జరిగిందని?' అని రాశాను.

ఆయన కాగితం అందుకొని చదివారు. నాకేసి చూశారు. చూపులో తెలీని బేలతనం. ఆయననెప్పుడూ అంత దీనంగా చూడలేదు నేను. "ఏమీ జరగలేదు కానీ, ఏమైనా జరిగిపోతుందేమోనన్న భయంగా ఉంది నాకు! అదే భరించలేకపోతున్నాను" అన్నారాయన. క్షణం ఆగి, చెయ్యి పట్టుకొని అన్నారు "ఉమా... నీకేమైనా అయితే..." ఆగిపోయారాయన!

మాటలకు భావావేశం అడ్డుపడింది. అక్షరాలు ఆగిపోయాయి మాటలు ముగిసిపోయాయి. ఆయన చెప్పదల్చుకొన్నదంతా, ఆయన చెప్పకపోయినా నాకు అర్థం అయిపోయింది.

ఒక్కరోజుకే పరిస్థితి అంతా ఇలా ఉంటే జీవితాంతమూ ఇలాగే గడపాలంటే ఎలా?

అవునూ... జీవితం అంతా మాటాపలుకూ లేని మూగవాళ్లు ఎలాగ గడుపుతున్నారు వాళ్ల జీవితాల్ని ? వాళ్ళలోనూ ఇంతటి అసంతృప్తి, ఆవేదన నిండి ఉంటుందా? లేకపోతే నేను మరీ ఎక్కువగా ఊహించుకొని బాధపడిపోతున్నానా?- తెలీదు.

"ఇంతక్రితం నువ్వు నాతో ఎప్పుడెప్పుడు ఏమేం మాట్లాడావో నాకయితే గుర్తులేదు! ఇప్పుడు ఆలోచిస్తోంటే...అసలు నీ మాట నేనెప్పుడైనా విన్నానా, అనిపిస్తోంది... ఒక్కసారి మాట్లాడవూ ప్లీజ్...!" అన్నారాయన! ఆ కంఠంలో జీర ఒక్కసారి నా మనసును వణికించింది.

- ఒక్కసారి గొంతెత్తి మాట్లాడి, ఆ తర్వాత మానేసినా పర్వాలేదనిపించిందా క్షణంలో! కానీ... క్షణకాలం ఆవేశంలో మునిగిపోయి, గొంతెత్తి మాటాడితే ఆ తర్వాత శాశ్వతంగా మూగపోవాల్సి వస్తుందేమో!...

వద్దు... ఈ సాహసం చెయ్యను! చెయ్యనంటే చెయ్యను! అంతే!!

- వారం రోజుల తర్వాత....

- రంగరాజుగారి దగ్గరకు వెళ్ళాల్సిన రోజది! ఆయన ఏమంటారోనన్న భయం నన్ను అణవణువూ ఆక్రమించింది. గుండె లోతుల్లోంచి ఎగిసిపడుతున్నఆందోళనను అణచిపెట్టుకొంటూ, ఏమీ జరగటంలేదని మనసుకు నచ్చచెప్పుకొనే విఫలయత్నం చేస్తూ, ఇంట్లో పని పూర్తిచేశాను.

ఆయన... తన పని చేసుకొంటున్నట్లు నటిస్తూ నన్ను పరిశీలించటం నాకు అర్థమవుతోంది. ఇంకా కనీసం మూడు నాలుగు గంటలు!!

బయలుదేరబోతోంటే అన్నారాయన - "ఒకసారి దేవుడికి దణ్ణం పెట్టుకొని బయలుదేరు!" అని! నాకు నవ్వొచ్చింది. బాధల్లో ఉన్నపుడే మనిషికి భగవంతుడు గుర్తొస్తాడు కాబోలు! గతంలో ఆయన ఎప్పుడూ ఇలా అని ఎరుగరు. ఇప్పుడూ అంటున్నారంటే, అది ఆయనలోని బేలతనానికి నిదర్శనం కాబోలు!!

ఆయన చెప్పినట్లే దణ్ణం పెట్టుకొని బయలుదేరాను. స్కూటర్ మీద వెళ్తోంటే ముందునుంచి గాలి రివ్వున శబ్దం చేస్తూ మమ్మల్ని రాసుకువెడుతోంది. అటూ ఇటూ వెళ్ళేకార్లు, సైకిళ్ళు బస్సులు లారీలు... అన్నీ ఏవేవో శబ్దాలు చేస్తూనే ఉన్నాయి.

ప్రపంచంలో చరాచరాలన్నీ ఏవేవో చప్పుళ్ళు చేస్తూనే ఉన్నాయి. నేను మాత్రం మూగపోయి. మాట పోయి, నిర్జీవమయిపోయి... ఎంతటి దారుణమైన చావు ఇది!!

ఆయన భుజం తట్టాను. స్కూటర్ ఆపమన్నట్లు, రియర్‌వ్యూలోంచి చూసి, నా భావం అర్థం చేసుకొని, స్కూటర్‌ను పక్కగా ఆపారు. దిగి, నడిచివెళ్ళి ట్రాఫిక్ ఐలాండ్ మధ్యలో కూర్చున్నాను. చేతిలోని పాడ్‌మీద అక్షరాలు పేర్చుకొంటూ మనసులోని మాటలను గుమ్మరించాను.

"మళ్ళీ మాట్లాడతానో లేదో ఒక్కసారి మాట్లాడనీయండి!

ఆయన అది చదివి, తల పైకెత్తారు. ఆయన కళ్ళలో జలపాతాలు. అవి వర్షించని మేఘధారలు!

అడ్డంగా తల ఊపారు మాట్లాడవద్దని!

'పోనీ, మీరు మాట్లాడండి, వింటాను అని రాశాను.

దానికి ఆయన తల ఊపారు. నా చేతిలోని ప్యాడ్‌ను అందుకొని వణుకుతున్న చేతులతో నెమ్మదిగా రాశారు : 'నా పెదవుల్లో ఒకటి మూగపోయింది. నా గుండెలో సగభాగం ఆగిపోయింది. నా జీవితం సగం ముగిసిపోయింది. ఇది విధి. ఇది విషాదం. ఇది నా భవితకు ముగింపు!"

నాకు ఏడుపు వచ్చింది. మనిషి మనిషిని ఇంతగా ప్రేమిస్తారా! ఈయన ... నన్నింతగా ప్రేమిస్తారా? ఈ సంగతీ నాకు తెలీదు. మాటపోతే పోనీ, ఇంత సిరిసంపదలు నాకున్నాయని ఇపుడే తెలుస్తోంది!

రంగరాజుగారు మళ్ళీ పరీక్షలు చేశారు. అన్ని పరీక్షలు అయ్యాక ఆయన నెమ్మదిగా అన్నారు. "గుడ్, చాలా బాగుంది! ఈమెకిక ఏ ఇబ్బందీ లేదు. వెళ్ళండి! వెళ్ళి మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుకోండి! ఎవ్విరిథింగ్ ఈజ్ ఆల్‌రైట్!!"

నమ్మబుద్ధి కాలేదు. వాగ్దేవి మళ్ళీ నన్ను కరుణించింది. మౌనంగా నేను చేసుకున్న ప్రార్థనలన్నీ వింది కాబోలు!!

డాక్టర్‌గారికి థాంక్స్ చెప్పేసి ఇంటికి వచ్చేశాం. దార్లో ఇద్దరమూ మాట్లాడుకోలేదు. సంతోషంతో మనసు మూగపోయిన క్షణాలవి!

మేం ఇద్దరమూ...గతంలోలా మాట్లాడుకోవటంలేదు. కానీ, మేం ఒకరినొకరం గతంలో కన్నా బాగా అర్థం చేసుకొంటున్నాం! నిశ్శబ్దంగా ప్రపంచం చెప్తున్న సందేశాలను వింటున్నాం! పెదవి విప్పకుండా, పన్నెత్తి పలకకుండా మనసుల్ని చదువుకొంటున్నాం!!

– ఈనాడు, ఆదివారం సంచిక